తల్లి ఒడికి గణనాథుడు



గణనాథుడిని నిమజ్జనానికి తీసుకొస్తున్న మహిళ



గోదావరిలో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



గోదావరి మధ్యలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

- నిమజ్జనోత్సవానికి భారీగా తరలివస్తున్న గణనాథులు
- ముమ్మర ఏర్పాట్లు చేసిన నగరపాలక సంస్థ



బొమ్మూరులో వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపులో చిన్నారుల సందడి

రాజమహేంద్రవరం సిటీ: భక్తుల విశేష పూజలు అందుకున్న గణనాథుడు తల్లి ఒడి చేరేందుకు గోదావరికి నదికి తరలివచ్చాడు. నగరంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా వాడవాడలా వందలాది విగ్రహాలను ఏర్పాటు చేసిన భక్తులు తొమ్మిది రోజుల పాటు భక్తితో పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున తీన్‌మార్ డప్పుల హోరు, డీజే సౌండ్‌లు, నృత్యాల నడుమ గణేశుడిని ఊరేగిస్తూ తీసుకొచ్చి గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారు. నగరంలో హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో ఇసుక రేవు వద్ద వినాయక నిమజ్జనోత్సవానికి నగరపాలక సంస్థ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భారీ క్రేన్ సాయంతో విగ్రహాలను తరలించి, లాంచీపైకి ఎక్కించి గోదావరి మధ్యలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలైన లాలాచెరువు, నామవరం, హుకుంపేట తదితర ప్రాంతాల నుంచి వినాయక నిమజ్జోత్సవానికి వందలాది విగ్రహాలు తరలి వస్తున్నాయి. మొత్తంగా సుమారు 1500 విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు.

మూడు షిఫ్టుల్లో పారిశుధ్య కార్మికులు

ఆదివారం చివరి రోజు కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు మూడు షిఫ్టుల్లో సేవలు అందించేందుకు 50 మంది పారిశుధ్య కార్మికులను నియమించారు. ఎప్పటికప్పుడు భక్తులు తీసుకొచ్చే విగ్రహాలను స్వాధీన పరచుకుని పంట్‌పైకి తరలించే చర్యలు చేపడుతున్నారు. భక్తులు పూజ చేసిన సామగ్రిని గోదావరిలో కలపకుండా చర్యలు చేపట్టారు. పంట్‌పై సుమారు 20 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

భారీగా పోలీస్ బందోబస్తు

నిమజ్జనానికి తరలివచ్చే భక్తుల కోసం ఇసుక రేవులో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్యం కోసం అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. అలాగే నిమజ్జనాల వేళ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం సెంట్రల్ జోన్ డీఎస్పీ, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు. పోలీస్, రెవెన్యూ, నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం అర్ధరాత్రి వరకూ నిమజ్జన కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తామని నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్ ఐ. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సైతం వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉంటారన్నారు. నగరంలో సుమారు 1,500 విగ్రహాలు గోదావరిలో నిమజ్జనం చేయనున్నారన్న అంచనాల మేరకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.



నిమజ్జనానికి తరలివచ్చిన గణనాథుని విగ్రహాలు



ధవళేశ్వరం రామపాదాలరేవులో గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళుతున్న భక్తులు

ధవళేశ్వరం: గణేష్ నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ధవళేశ్వరం రామపాదాల రేవు వద్ద ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి పందిర్లలోని గణపతిని ఊరేగింపుగా ధవళేశ్వరం రామపాదాల రేవుకు తీసుకువచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక పంటు ద్వారా గణనాథులను గోదావరిలో నిమజ్జనం చేశారు. ధవళేశ్వరం సీఐ టి గణేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ఘనంగా ఇంజినీర్స్ డే



ధవళేశ్వరంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న ఇంజినీర్లు, ఇరిగేషన్ సిబ్బంది

ధవళేశ్వరం: ఇంజినీర్స్ డేను ఆదివారం ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చూపిన మార్గంలో ఇంజినీర్లు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్ కాశీవిశ్వేశ్వరరావు, డీఈ యు.రమేష్, ఏఈ అద్దంకి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఆదివారం తెలిపారు. ఆర్అండ్‌బీ వాంబే హౌసెస్, రాజీవ్ గాంధీ కాలనీ, మున్సిపల్ కాలనీ, రత్నంపేట, కోరుకొండ రోడ్ రాజా థియేటర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ విద్యుత్ నిలిచిపోతుందన్నారు. అలాగే ఆర్‌వీనగర్, వీవర్స్ కాలనీ, విద్యానగర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

బులి వెంకయమ్మకు చిర్ల జగ్గిరెడ్డి నివాళులు



బులి వెంకయమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చింతా బులి వెంకయమ్మ మృతికి కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని దానవాయిపేట గానుగ వీధిలో సీపీ రెడ్డి మోటార్స్ షోరూమ్ అధినేత చింతా ప్రసాద రెడ్డి నివాసంలో ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా బులి వెంకయ్యమ్మ అనేక ధార్మిక సంస్థలకు, సేవా సంస్థలకు చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ చార్జీలు పెంచాలి

ప్రకాశం నగర్: ఆన్‌లైన్‌లో బుక్ చేస్తున్న రాపిడో, ఊబర్, ఓలా యాజమాన్యాలు ఆటో డ్రైవర్లకు సర్వీస్ చార్జీలు పెంచాలని, కనీసం రూ.60 ఉండేలా చూడాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబళ్ల సూర్యారావు భవన్ కార్యాలయంలో ది రాజమండ్రి ఆన్‌లైన్ రాపిడో, ఊబర్, ఓలా ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్, డీమార్ట్, కంబాలచెరువు, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర రద్దీ ప్రాంతాల్లో కస్టమర్లు ఆన్‌లైన్‌లో ఆటో బుక్ చేసుకుని అక్కడ ఆగితే అక్కడున్న ఆటోవారు ఆన్‌లైన్ ఆటో డ్రైవర్‌లను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. రాపిడో బుకింగ్‌లో సింగిల్ రేటు కనపడాలని మధు డిమాండ్ చేశారు. ఈ విషయాలపై ఆయా యాజమాన్యాలకు ఫిర్యాదులు అందజేస్తామన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

కడియం: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. లయన్స్‌క్లబ్ హార్టీకల్చర్ అధ్యక్షుడిగా పుల్లా ఆంజనేయులను ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిలను క్లబ్ తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలు చూడలేని రాజధాని అమరావతి



మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: చంద్రబాబు ఆర్థిక ప్రయోజనాల కోసం లోతట్టు ప్రాంతంలో రాష్ట్ర రాజధానిగా అమరావతి నిర్మాణం చేయడం భవిష్యత్ తరాలకు పెను ప్రమాదమని రాష్ట్రీయ ప్రజాకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మొండిగా ఆంధ్రప్రదేశ్ పాలకులు వారి రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం చేపడుతున్న అమరావతిని ఈతరం వారే కాదు భవిష్యత్ తరాలవారు సైతం చూడలేరన్నారు. అనుభవజ్ఞులు, శాస్త్రీయ పరమైన నిష్ణాతులు అమరావతి రాజధానిగా అనువైన ప్రదేశం కాదని, ఈ ప్రాంతంలో నిర్మాణాలకు సుమారు 40 అడుగుల లోతు వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారన్నారు. సహజంగా ఈ విధమైన లోతు సముద్రంలో చేసే నిర్మాణాలకు అవసరం అని, దాని కన్నా దారుణమైన పరిస్థితి అమరావతి ప్రాంతంలో ఉందన్నారు. ఇప్పటికే రూ.9.5 కోట్ల పైబడి రాజధాని నిర్మాణం పేరుతో ఖర్చు చేసినట్టు కల్పిత గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఈతరం వారు చూడగలిగే ఏకైక రాజధాని, అనువైన ప్రాంతాలు, తక్కువ నిధులతో సాధ్యమయ్యేవి గుంటూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్టణం, కర్నూల్ ప్రాంతాలేనన్నారు. ఇప్పటికే అన్యాయమైపోయిన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌పై మరో రాజకీయ పెత్తందారి కుట్ర జరుగుతుందని, ఆంధ్రులు చూస్తూ కూర్చుంటే మన బిడ్డల భవిష్యత్‌కు పెను ప్రమాదం సంభవించనుందని హెచ్చరించారు.

చెరుకూరి గొడౌన్స్‌లో కంటైనర్ల దగ్ధం

- వెల్డింగ్ చేస్తుండగా ఎగిసిపడిన మంటలు
- అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



చెరుకూరి గొడౌన్‌లో దగ్ధమవుతున్న రిలయన్స్ సంస్థకు చెందిన కంటైనర్ రూమ్‌లు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక హుకుంపేట చెరుకూరి గొడౌన్స్ ఆవరణలో ఉన్న రిలయన్స్ సంస్థకు చెందిన కంటైనర్లలో ఆదివారం వెల్డింగ్ చేస్తుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని భారీ ఆస్తి నష్టం సంభవించకుండా మంటలను అదుపుచేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి పక్కన చెరుకూరి గొడౌన్స్ ఉన్నాయి. గొడౌన్స్ ఆవరణలోనే రిలయన్స్ సంస్థకు సంబంధించిన గ్రోసరీ గొడౌన్ ఉంది. అయితే ఇక్కడ ఉన్న వేస్ట్ మెటీరియల్‌ను వేసుకునేందుకు ఆవ కాలువ పక్కన రెండు కంటైనర్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఆవ కాలువ ఆక్రమణల తొలగింపులో భాగంగా మండల అధికారులు ఈ కంటైనర్ రూమ్‌లను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం సదరు యాజమాన్యం కంటైనర్ రూమ్‌లను తొలగించేందుకు వెల్డింగ్ పని చేస్తుండగా వేస్ట్ మెటీరియల్ అంటుకోవడంతో కంటైనర్ రూమ్‌ల్లో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. విషయం తెలుసుకున్న రాజమహేంద్రవరం అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు సిబ్బందితో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. అదే ఆవరణలో ఏపీ బేవరేజస్ మద్యం డిపో, ఓ పెయింట్స్ గొడౌన్, కార్ల సర్వీస్ సెంటర్‌లు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను సకాలంలో అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో వేస్ట్ మెటీరియల్ పొగ జాతీయ రహదారిని కమ్ముకోవడంతో పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు వాహన చోదకులు సైతం భారీ ప్రమాదం చోటు చేసుకుందేమోనని ఆందోళనకు గురయ్యారు.

వైభవంగా గణపతి హోమం



దుళ్లలో గణపతి హోమం చేస్తున్న భక్తులు

కడియం: మండలంలోని దుళ్ల శివాలయం వీధిలోని లక్ష్మీగణపతి పందిరి వద్ద ఆదివారం గణపతి హోమం వైభవంగా జరిగింది. బాదంపూడి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భారీ అన్నసమారాధన

ధవళేశ్వరం: స్థానిక రథం వీధిలో యడ్ల మహేష్, రథం వీధి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. పిన్నింటి వారి వీధిలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ఆదివారం అన్నసమారాధన చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని మిర్తిపాడుకు చెందిన ధార రాముడు (28) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు స్థానిక హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. రాముడుకు రెండు నెలలుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాయి. కాగా శనివారం నొప్పి ఎక్కువగా రావడంతో తట్టుకోలేక గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు ధార రాజు ఇచ్చిన ఫిర్యాదు, ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు.

మరమ్మతులు.. తప్పని వెతలు

- జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ సమస్య
- మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ పేరుతో రహదారి బ్లాక్
- ఆమడ దూరం పనికి కిలోమీటరు మేర స్టాపర్లు పెడుతున్న వైనం
- అత్యవసర వాహనాలకు తప్పని ఇక్కట్లు



హైవేపై దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు వద్ద జంగిల్ క్లియరెన్స్ కోసం ఏర్పాటు చేసిన స్టాపర్లు



లాలాచెరువు వద్ద సగం రహదారి బ్లాక్ చేసిన దృశ్యం

రాజానగరం: రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తారు. కాగా జాతీయ రహదారిపై వాటిని వేసి, వాహనాల వేగాన్ని నియంత్రించడానికి అవకాశం ఉండదు. స్పీడ్ బ్రేకర్లు లేకపోతే ఏమి, మేమున్నాం కదా అంటున్నారు జాతీయ రహదారిపై మరమ్మతులు, క్లీనింగ్, పెయింటింగ్ వంటి వివిధ రకాల పనులు చేసే సిబ్బంది. రక్షణ కోసం వీరు ఏర్పాటు చేసే స్టాపర్లు పలుచోట్ల ప్రయాణికుల సహనాన్ని పరీక్షించే విధంగా ఉంటున్నాయి.

25 కిలో మీటర్ల పైబడి..

జిల్లాలోని జాతీయ రహదారిపై ముఖ్యంగా రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వరకూ సుమారు 25 కిలో మీటర్లు పైబడి ప్రయాణికులు తరచూ ట్రాఫిక్ అంతరాయాలను ఎదుర్కోవలసి వస్తోంది. జిల్లాలో రావులపాలెం నుంచి తుని వరకూ సుమారు 130 కిలో మీటర్ల మేర 16వ నంబర్ జాతీయ రహదారి ఉంది. ప్రస్తుతం ఈ రహదారిపై వర్షాలతో పడిన గోతులను పూడ్చడం, డివైడర్లకు రంగులు వేయడం, జంగిల్ క్లీనింగ్ వంటి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పనులు జరిగేచోట స్టాపర్లు పెట్టి రహదారిపై రాకపోకలను నిరోధిస్తున్నారు. సాధారణంగా పని చేసే ప్రాంతంలోనే వీటిని ఏర్పాటు చేయడం సహజం, కానీ పని ఏదైనా (డివైడర్‌పై తుప్పలు శుభ్రపర్చడం, రంగులు వేయడం, వంటి వాటితో సహా) సిబ్బంది సేఫ్టీ కోసం చేసే పనికి పర్లాంగు దూరం, కొన్నిసార్లు కిలోమీటరు దూరం వరకూ స్టాపర్లు పెట్టి, రహదారిపై ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ విధంగా స్టాపర్లు పెట్టడం వలన రహదారి వెడల్పును సగానికి పైగా తగ్గించేస్తుంటే ఆ ఇరుకు దారిలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. తరచూ ట్రాఫిక్ స్తంభించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

అత్యవసర వాహనాలకు తిప్పలు

జాతీయ రహదారిపై 108 వంటి అత్యవసర వాహనాలకు కూడా ట్రాఫిక్ ఇబ్బంది తప్పడం లేదు. ఈ కారణంగా వాటిలో ఉన్న రోగుల ప్రాణాలు ఒక్కోసారి గాల్లో కలిసిపోతాయా ? అనే భయం కలుగుతోంది. ట్రాఫిక్ స్తంభించినప్పుడు అత్యవసర వాహనాలకు ఏదో విధంగా మార్గం ఇవ్వాలని రోడ్డు భద్రతా నిబంధనలు తేటతెల్లం చేస్తున్నా, ప్రస్తుతం వాటి అమలు జాతీయ రహదారిపై కానరావడం లేదు.

రహదారిపైనే నిరీక్షణ

జాతీయ రహదారిపై జంక్షన్ల నుంచి సర్వీసు రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో బస్సుల కోసం నిరీక్షించే కాలేజీ విద్యార్థులు, ఇతర ప్రయాణికులు ఆయా జంక్షన్లలో బస్సులు ఎక్కేందుకు గతంలో మాదిరిగా స్థలం లేకపోవడంతో రహదారిపైనే నిలబడవలసి వస్తోంది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విద్యార్థులు కళాశాలలకు, ఉద్యోగులు కార్యాలయాలకు రాకపోకలు సాగించే ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ కారణంగా గంటల తరబడి నిరీక్షించవలసి వస్తోంది.

రద్దీని దృష్టిలో పెట్టుకోవాలి



జాతీయ రహదారిపై పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుంటే ఇటువంటి సమస్యలు ఉండవు. ఎక్కడైతే పని చేస్తున్నారో ఆ ప్రాంతానికి కొద్దిదూరంలో రోడ్డును బ్లాక్ చేయడం వలన పెద్దగా ఇబ్బంది ఉండదు. పర్లాంగు, కిలో మీటరు దూరం బ్లాక్ చేయడం వలన రద్దీ పెరిగి, ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

– డాక్టర్ వి.కనకరాజు, అధ్యాపకుడు, రామస్వామిపేట

ఎక్కువ దూరం బ్లాక్ చేస్తున్నారు



రహదారిపై పనులు జరిగే సమయంలో ప్రమాదాలు జరగకుండా సిబ్బంది రక్షణ కోసం స్టాపర్లు పెట్టడం పరిపాటి. పని చేసే ప్రాంతం కంటే ఎక్కువ దూరం స్టాపర్లు పెట్టి, ట్రాఫిక్ సమస్యను సృష్టించడం సరికాదు. ఒకవైపు రహదారిపై వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఈవిధంగా చేయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– పెంటగట్ల రామకృష్ణ, ప్రయాణికుడు, సంపత్‌నగరం

రూ.30 వేలు పలికిన గణపతి లడ్డూ



గణపతి లడ్డూను దక్కించుకున్న వాయులపల్లి రాము కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరికొండ వేంకటేశ్వరస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన గణపతి నవరాత్ర వేడుకల్లో ఏర్పాటుచేసిన లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించారు. స్థానికుడు వాయులపల్లి రాము దంపతులు గణపతి లడ్డూను రూ.30 వేలకు దక్కించుకున్నారు. మోరంపూడి జంక్షన్‌లో శ్రీసత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల్లో భాగంగా అన్నదానం నిర్వహించారు. అనంతరం ఏడడుగుల మట్టి విగ్రహాన్ని భారీ ఊరేగింపుతో నిమజ్జనం చేశారు.

17న అనంత పద్మనాభస్వామి వ్రతం



వ్రత పుస్తకం ఆవిష్కరించిన వేంకన్నబాబు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: సకల శుభాలు చేకూర్చే అనంత పద్మనాభస్వామి వ్రతాన్ని ఈనెల 17వ తేదీన గాడాల శ్రీమహాలక్ష్మి సమేత చిన్నవేంకటేశ్వర స్వామివారి పీఠంలో 108 జంటలతో నిర్వహించనున్నట్లు పీఠాధిపతి డాక్టర్ శ్రీమాన్ చిన్న వేంకన్నబాబు స్వామీజీ తెలిపారు. ఆదివారం నగరంలో జయశ్రీ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో వ్రత పుస్తకాన్ని జాతీయ చైర్‌పర్సన్ దుర్గావెంకట హేమావతి మాత ఆవిష్కరించారు. వ్రతమాచరించే భక్తులు ముందుగా పీఠం నంబరు 86888 88999 సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగంశెట్టి మహితోష్, పూర్ణిమ రాజ్, బిందు, అంబటి శ్రీనివాసరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానది శోభపై కవితలు

ప్రకాశం నగర్: నది అంటేనే ఒక గతి, కమనీయ శ్రుతి, రమణీయ జతి అని విశ్రాంత ఆచార్యులు డాక్టర్ చిలుకూటి కూర్మయ్య అన్నారు. కందుకూరి వీరేశలింగం నాటక సమాజంలో ఆదివారం జరిగిన రచయితల సమావేశంలో కవులు, రచయితలు పాల్గొని కృష్ణానది శోభపై అద్భుతమైన కవితలు వినిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కూర్మయ్య మాట్లాడుతూ 'నాగార్జునుని బోధనలు ఫలించిన చోట బౌద్ధమత వృక్షమ్ము పల్లవించిన చోట కృష్ణవేణి తరంగిణి జాలిగుండెయే సాగరమ్మై రూపు సవరించుకొనునీట ఆడవే – జలకమ్ములాడవే' అన్న సినారె పాటను గుర్తుకు తెచ్చారు. రచయిత పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చలన చిత్ర పరిశ్రమకు నదులు ఆయువు పట్టు వంటివన్నారు. కృష్ణా, గోదావరి నదులు తెలుగింటి కోడళ్లుగా అభివర్ణించారు.

వినాయకుడిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



శంభూనగర్‌లో వినాయకుడిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక శంభూనగర్‌లో రాయుడు సతీష్ మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్ర ఉత్సవాల్లో వినాయకుడిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి పి.వెంకట జ్యోతిర్మయి దంపతులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రాయుడు సతీష్, రాయుడు రాజవల్లి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	35 చిన్నకథ కాదు
సూర్యమినీ	:	ఉత్సవం
సూర్యప్యాలెస్	:	ఏఆర్ఎం
స్వామి	:	సరిపోదా శనివారం
అశోక	:	ఆయ్
శివజ్యోతి	:	మత్తు వదలరా-2
అనుశ్రీ	:	మత్తు వదలరా-2
రాజా	:	మత్తు వదలరా-2
రంభ	:	కళింగ
ఊర్వశి	:	భలే ఉన్నాడే, కమిటీ కుర్రోళ్లు
మేనక	:	3
కుమారి	:	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్(గోట్)
అప్సర	:	సరిపోదా శనివారం
నామవరం		
వీఎస్ మహల్	:	ఏఆర్ఎం
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మత్తు వదలరా-2
కడియం		
వెంకటసూర్య	:	మత్తు వదలరా-2